'కార్మికుల సమస్యలను పరిష్కరించాలి' 8


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగన్న



వరం 'గన్'!

ఓరుగల్లులో రెచ్చిపోతున్న గన్ గ్యాంగ్



- భూపాలపల్లిలో హత్య కోసం సుపారీ
- శాయంపేటలో లారీ డ్రైవర్‌కు బెదిరింపులు
- ములుగులో పాన్‌షాపు వద్ద తుపాకీతో హల్‌చల్
- వరుస సంఘటనలతో ఉలిక్కిపడుతున్న ఉమ్మడి జిల్లా జనం
- హైదరాబాద్‌లో శాయంపేట పోలీసులకు చిక్కిన రౌడీషీటర్ సూరి
- బిహార్ నుంచే తుపాకులు సరఫరా అయినట్లుగా గుర్తింపు
- పోలీసుల నిఘా వైఫల్యంతో రెచ్చిపోతున్న రౌడీషీటర్లు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లులో తుపాకులు హల్ చల్ చేస్తున్నాయి. హత్యలకు రౌడీలు సుపారీ తీసుకుంటున్నారు. గంజాయి తాగిన మైకంలో గన్‌తో బెదిరించి.. దాడులకు దిగుతున్నారు. రోడ్డుపై బహిరంగంగా గన్‌లతో రౌడీషీటర్లు బెదిరింపులకు దిగుతున్నారు. ఒక్కసారిగా గన్‌కల్చర్ తెరపైకి రావటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జిల్లా నెక్కొండ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సురేందర్ అలియాస్ సూరి హైదరాబాద్ నుంచి వరంగల్‌కు మకాం మార్చి.. తన గన్ గ్యాంగ్‌తో హత్యకు ప్లాన్ చేశారనే ప్రచారం కలకలం రేపింది. భూపాలపల్లి, ములుగు, శాయంపేటలో క్రిమినల్స్ చర్యలు ప్రజలు ఉలిక్కిపడేలా చేసింది. ఇప్పటికే పొలిటికల్ రౌడీలతో అవస్థలు పడుతున్న ప్రజలకు కొత్తగా క్రిమినల్స్ కూడా అడుగుపెట్టడంతో గన్ కల్చర్ పెరుగుతుందనే భయాందోళనలో ఉన్నారు. దీనిపై పోలీసుల నిఘా వైఫల్యం కనబడుతోందనే విమర్శలున్నాయి.

గన్ గ్యాంగ్ కలకలం

కొన్నాళ్లుగా రౌడీల హత్యలు.. గుండాల బెదిరింపులు లేకుండా ప్రశాంతంగా ఉన్న ఓరుగల్లులో గన్ గ్యాంగ్ కలకలం సృష్టించింది. ములుగు, శాయంపేట, భూపాలపల్లిలో గన్ గ్యాంగ్ చేసిన దాడులు పోలీసువర్గాల్లో కలకలం రేపాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. గన్‌గ్యాంగ్ బాగోతంపై ఆరా తీసి కంగుతిన్నాయి. వరంగల్ జిల్లా నెక్కొండ ప్రాంతానికి చెందిన సురేందర్ అలియాస్ సూరి అలియాస్ మునీర్ హైదరాబాద్ కేంద్రంగా నాలుగైదు ఉమ్మడి జిల్లాల్లో దందాలు సాగిస్తున్నారని తెలుస్తోంది. అయితే ఇటీవల సూరిపై రౌడీషీట్ ఓపెన్ చేయటంతో పాటు నగరం నుంచి పోలీసులు బహిష్కరించటంతో తన అనుచరులతో కలిసి హనుమకొండకు మకాం మార్చినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో ఇటీవల భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ యువకుడు మేడారంలో హత్యకు గురయ్యాడు. భూపాలపల్లికి చెందిన ఆరుగురికి ఈ హత్యతో సంబంధం ఉన్నట్లుగా పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్ట్ కూడా చేశారు. అయితే నిందితులపై ప్రతీకారం తీర్చుకునేందుకు హత్యకు గురైన వ్యక్తి బంధువు ఒకరు సూరి గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చినట్లుగా తేలింది. హనుమకొండ నగరంలో మకాం వేసిన సూరి గ్యాంగ్ గత నెల రెండో వారంలో భూపాలపల్లిలో రెక్కీ నిర్వహించాడు. నిందితులు జైలులో ఉన్నట్లు తెలియటంతో హత్యకు గురైన యువకుడి సమాధి వద్దకు వెళ్లి గన్‌తో కాల్పులు జరిపి హల్‌చల్ చేసినట్లుగా సమాచారం.

ఈ సంఘటన మరువక ముందే గత నెల 18వ తేదీన శాయంపేట మండలం మందారిపేట వద్ద ఈ రౌడీషీటర్ల ముఠా గంజాయి తాగిన మైకంలో వరంగల్ వైపు వస్తున్న లారీని ఆపి డ్రైవర్‌ను చితక్కొట్టారు. తుపాకీ గురిపెట్టి డ్రైవర్ నుంచి డబ్బులు గుంజుకున్నట్లుగా సమాచారం. ఈ విషయంపై శాయంపేట పోలీసుస్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు చేయటంతో ఈ గన్ గ్యాంగ్ ముఠా వ్యవహారం తెరపైకి వచ్చింది. దీంతో శాయంపేట పోలీసులు గన్ గ్యాంగ్ కోసం వేటాడుతున్న క్రమంలోనే ప్రధాన నిందితుడు సూరి హైదరాబాద్‌లో పోలీసులకు చిక్కారు. ఈ క్రమంలో శాయంపేట ఎస్సై పరమేశ్వర్‌పై రౌడీషీటర్ ఎదురుదాడికి ప్రయత్నించినట్లుగా సమాచారం. చాకచక్యంగా ఎస్సై తన సిబ్బందితో కలిసి సూరిని అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిసింది. నిందితుడితో పాటు

(మిగతా 7లో..)

ఓరుగల్లులో రౌడీషీటర్ తన గ్యాంగుతో మకాం వేసి, హత్యలకు సుపారీ తీసుకుని, బహిరంగంగా తిరుగుతుంటే.. నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే వరంగల్ నగరంలో చాలామంది చోటామోటా పొలిటికల్ రౌడీలు బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవలకాలంలో పోలీసులు రౌడీలపై నిఘా పెట్టి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ అక్కడక్కడ రౌడీషీటర్ల దందాలు సాగుతూనే ఉన్నాయి. రాజకీయ అండతో వారు రెచ్చిపోతున్నారు. భూతగాదాలు, కుటుంబ సమస్యలు, అప్పులు ఇతరత్రా

నిఘా వైఫల్యమేనా..?

వాటితో హత్యలు జరుగుతున్నప్పటికీ రౌడీలు సుపారీ తీసుకుని హత్యలు చేసిన సంఘటనలు ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్దగా లేవు. అయితే సూరి గ్యాంగ్ భూపాలపల్లి జిల్లాలో ఆరుగురి హత్యకు సుపారి తీసుకున్నారనే ప్రచారం కలకలం రేపుతోంది. భూపాలపల్లిలో హత్యకు గురైన యువకుడి సమాధి వద్ద తుపాకులు కాల్పులు జరిపినా పట్టించుకోలేదని, చింతగట్టు సమీపంలో ఎన్‌హెచ్ 163 రహదారిపై రౌడీషీటర్ గ్యాంగ్ బహిరంగంగా పార్టీలు చేసుకున్నా.. పసిగట్టలేకపోయారనే చర్చ జరుగుతోంది. మందారిపేట ఘటనపై డ్రైవర్ ఫిర్యాదు ఇచ్చే వరకు కూడా క్రిమినల్స్ నడవడికపై నిఘా వర్గాలు దృష్టి పెట్టలేకపోయాయా? అనే చర్చ జరుగుతోంది. ములుగులో బహిరంగంగా తుపాకీతో బెదిరించే వరకు గన్‌గ్యాంగ్ అగడాలు విస్తరించాయని.., వీటన్నింటినీ కూడా నిఘా వర్గాలు గుర్తించి పోలీసులను అలర్ట్ చేయలేకపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తానికి గన్ గ్యాంగ్ హల్‌చల్‌తో మరోసారి ఓరుగల్లులో గన్‌కల్చర్ తెరపైకి వచ్చిందనే చర్చ జరుగుతోంది.

అన్నదాతల ఆక్రోశం

- అధిక ధరకు యూరియా విక్రయంపై మండిపాటు
- జయపురం రైతు వేదిక ఎదుట ఆందోళన
- ఏఈవోను నిలదీసిన రైతులు


జయపురం రైతు వేదిక ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట మండలంలో యూరియా పంపిణీలో అన్నదాతలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ప్రైవేటు ఎరువుల దుకాణం యజమానులు ఒక్కో యూరియా బస్తాకు రూ.20 నుంచి రూ.30 అదనంగా కర్షకుల నుంచి వసూలు చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు ఆదివారం జయపురం రైతు వేదికలో ఏఈవో కల్యాణిని నిలదీసిన అనంతరం, బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులుకందుల భూపాల్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, నలమాస రాజు, సురేష్, కందుకూరి రామస్వామి మాట్లాడారు. యూరియా పంపిణీ భాగంగా కౌసల్యదేవిపల్లి క్లస్టర్ పరిధిలో అక్కిరాల, బొజ్జన్నపేట, కొమ్ములవంచ, జయపురం గ్రామాలకు చెందిన ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 150 మందికి కూపన్లు అందించారు. నర్సింహులపేటలోని ఓ ప్రైవేటు ఎరువుల దుకాణం వద్దకు వెళ్లి కూపన్ చూపిస్తే ఒక్కో యూరియా బస్తాకు రూ.300 చొప్పున తీసుకుంటుండడంతో అదేమిటని ప్రశ్నించారు. నిన్నటి వరకు బస్తాకు రూ.280 తీసుకొని, ఇప్పుడు రూ.300 ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ అధికారి తెరచాటు సహకారంతోనే బస్తాకు అదనంగా రూ.20 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతులు అలువాల నవీన్, కోటి, వీరన్న, వెంకన్న, రామూర్తి, యాకయ్య, జనార్ధన్ రెడ్డి, పుల్లయ్య, గండి వెంకన్న ఉన్నారు.

ఎరువుల నియంత్రణ చట్ట ప్రకారం చర్యలు : వినయ్‌కుమార్, ఏవో

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా రైతులకు అందజేయాలి. ఎక్కువ ధరకు విక్రయిస్తే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. నర్సింహులపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఎరువుల దుకాణంలో యూరియా పంపిణీలో ఒక్కో బస్తాకు రూ.20 నుంచి రూ.30 అదనంగా తీసుకుంటున్నట్లు రైతులు ఆందోళన చేసి, తమ దృష్టికి తీసుకవచ్చారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

మహా నిరసన కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలి

- రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగ సంఘం బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 7న నిర్వహించనున్న మహా నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మైస నాగయ్య, వలబోజు సోమయ్య కోరారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని గత, ప్రస్తుత ప్రభుత్వాలకు వినతి పత్రాలు అందజేసినప్పటికీ అవి పరిష్కరించబడలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మోహన్‌రావు, నారాయణ, రాములు, చంద్ర య్య, మంగపతిరావు, అరుణకుమారి, ప్రసాద్‌రావు, వెంకట్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాసరావు, నాగేందర్, మల్లయ్య, గోవర్ధన్, చంద్రమౌళి, వెంకటయ్య, వెంకటేశ్వరరావు,జనార్దన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బహుజనులు ఏకమైతేనే రాజ్యాధికారం

- అరుణోదయ సాంస్కృతిక మండలి రథసారథి విమలక్క
- కొప్పులలో వైభవంగా వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహావిష్కరణ

శాయంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆదివాసీలు అంతా ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని అరుణోదయ సాంస్కృతిక మండలి రథసారథి విమలక్క అన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో ఆదివారం విమలక్క విశ్రాంత కరీంనగర్ విద్యాశాఖ డైరక్టర్ కొల్లూరు మల్లేశం, విగ్రహ స్థల దాత వంగాల నారాయణరెడ్డిలతో కలిసి వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కార్యక్రమ నిర్వాహకుడు, విగ్రహదాత కొప్పుల గ్రామానికి చెందిన మైనాల రాజేందర్(రాజు) అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో విమలక్క మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అంతమొందించి, కొందరికి అడవి సంపదను దోచిపెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రశ్నించేవారు ఉండకూడదని, ప్రశ్నిస్తే మట్టుబెడతామనే వ్యవస్థ వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా అందరం ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. బాని సత్వం నుంచి ముందుకొచ్చామని, నవసమాజం కావాలని ఆకాంక్షించారు. ఒక్కో సంవత్సరం ఒక్కో అంశంపై ముందుకువస్తున్నామని, ప్రకృతి రక్షణపై ప్రజలను చైతన్యం చేస్తున్నామని, ఈ క్రమంలోనే అడవుల రక్షణకు పూనుకున్నామన్నారు. తెలంగాణ అమవీరుల ఆశాయలకనుగుణంగానే పోరాడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగించాలంటూ, తన పాటలతో గ్రామస్తులను చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్, అసిస్టెంట్ డైరక్టర్ జువైనల్ హైదరాబాద్ అలువాల రాజేందర్, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


కొప్పులలో చిట్యాల ఐలమ్మ విగ్రహావిష్కరణలో విమలక్క


గార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు (ఫైల్)

అక్కడ అధికం.. ఇక్కడ సాధారణం

- నాలుగు మండలాల్లో ఎక్కువ వర్షపాతం
- మూడు చోట్ల మామూలు వానలు
- జిల్లాలో కేసముద్రం టాప్..

8

రేషన్ బియ్యం పట్టివేత

గార్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సీతంపేటలో పెట్రోలింగ్ చేస్తుండగా.. ముగ్గురు వ్యక్తులు గ్రామంలోని పేదల నుంచి కొనుగోలు చేసిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొన్నట్లు ఎస్సై సాయికుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. నామాలపాడుకు చెందిన అక్షయ్, అంకన్నగూడెంకు చెందిన రాజేష్, నామలపాడు బయ్యారం మండలానికి చెందిన తోలం శివ కలిసి అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్నారు. వీరిని అదుపులోకి తీసుకొని బియ్యాన్ని సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'క్రీడాకారులు లక్ష్యంతో ముందుకు సాగాలి'


అర్చరీ క్రీడల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న పుట్ట శంకరయ్య

నెల్లికుదురు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు పట్టువిడవని లక్ష్యంతో ముందుకు సాగాలని ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి కమిటీ సభ్యుడు పుట్ట శంకరయ్య కోరారు. నెల్లికుదురులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వక్రీడ వేదికలైన ఒలంపిక్స్‌లో ఆర్చరీ క్రీడాకారులకు గోల్ కావాలన్నారు. క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. దూరదృష్టితో ఆలోచించి క్రీడలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆర్చరీ గోల్డ్ మెడలిస్టు నానావత్ రవీందర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ చెడుపెల్లి ఐలయ్యపాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి' 8

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మొగుళ్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన అప్పాటి రవీందర్ రెడ్డి మొగుళ్లపల్లి నుంచి పరకాల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. గణపురం సమీపంలోని ఫంక్షన్‌హాల్ నుంచి వెల్దండి చరణ్‌తేజ మొగుళ్లపల్లికి వస్తుండగా రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రవీందర్‌రెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు. చరణ్‌తేజ తలకు బలమైన గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలించారు. చరణ్‌తేజ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

లంబాడీలను ఎస్టీ హోదా నుంచి తొలగించాలి

- ఆదివాసీ జేఏసీ చైర్మన్ శ్రీనివాస్

ఏటూరునాగారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ) హోదా నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) చైర్మన్ పూనెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా లంబాడీలకు ఎస్టీ హోదా కల్పించడం వల్ల అసలైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ఈ డిమాండ్‌ను బలంగా వినిపించడానికి ఐటీడీఏ కార్యాలయ వద్ద సోమవారం చేపట్టే ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాలకు, ప్రజలకు, నాయకులను కోరారు. తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు వట్టం ఉపేందర్, గుండు శరత్, పూనెం రామ్, కబ్బాక శ్రావణ్ కుమార్, వాసం నాగరాజు, వర్షిక సతీష్, కాపుల సమ్మయ్య పాల్గొన్నారు.

కేజీబీవీలో పోస్టులను భర్తీ చేయాలి

మొగుళ్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొర్కిశాల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్పెషలాఫీసర్, పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లుతోపాటు విద్యార్థినుల తల్లిదండ్రులు కోరారు. ఆగస్టు 4న పాఠశాలలో బాలికలకు ఫుడ్ పాయిజన్ కావడంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో కలెక్టర్ రాహుల్ శర్మ తక్షణమే స్పందించి ఈసంఘటనకు కారకులైన పాఠశాల స్పెషలాఫీసర్ శైలజతోపాటు పీఈటీ శ్రావణిని విధుల నుంచి పూర్తిస్థాయిలో తొలగించారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించకుండా ఇదే పాఠశాలలోని ఉపాధ్యాయురాలికి ఇన్‌చార్జి స్పెషలాఫీసర్‌గా బాధ్యతలు అప్పగించారు. కాగా, ఆ ఉపాధ్యాయురాలు పూర్తిస్థాయిలో స్పెషలాఫీసర్‌గా విధులు నిర్వర్తించకలేకపోతున్నారని ఆరోపించారు. పీఈటీ పోస్టు ఖాళీగా ఉండడంతో విద్యార్థినులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్ స్పందించి పాఠశాలకు స్పెషలాఫీసర్‌తోపాటు పీఈటీ పోస్టును త్వరగా భర్తీ చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా గంగా బోనం పండుగ



గంగమ్మకు బోనం తీసుకెళ్తున్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దేవాదుల రిజర్వాయర్ అలుగు పడుతుండడంతో గంగమ్మ శాంతించాలని కోరుతూ గ్రామంలోని వివిధ కులాలకు చెందిన వారు బోనాలు ఆదివారం సమర్పించారు. సాంప్రదాయంలో భాగంగా గ్రామానికి చెందిన యాదవ కులస్థుల ఇంటి నుంచి ముదిరాజ్, గౌడ కులస్థుల ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య గంగా బోనంను తీసుకెళ్లి రిజర్వాయర్ మత్తడి వద్ద భక్తులు రిజర్వాయర్‌లోకి దిగి గంగమ్మకు పసుపు, కుంకుమ, పూలు, చీరను సమర్పించి పూజలు చేశారు. రూపొందించిన వెదురు గంపలో బోనంను పెట్టి గంగమ్మకు సమర్పించారు. మత్స్య సొసైటీ చైర్మన్ నీల సోమన్న, నీల ఐలయ్య, రమేష్, గోనెల రా జు, గోనెల ఉపేందర్, వెంకన్న, నీల సాంబరాజు, మునిగెల ఐలోని, రాజు, శ్రీనివాస్, నవీన్, ఉప్పలయ్య, కుంభం సాంబరాజు, బంగ్లా శ్రీనివాస్, గట్టు ఉప్పలయ్య, గట్టు రమేష్, అమరాజు రాజన్న, బుచ్చయ్య, వెంకన్న పాల్గొన్నారు.

నడవని 'బతుకుబండి'

● రోడ్డున పడుతున్న లారీ యజమానులు ● కోల్డ్‌బెల్ట్‌లో సన్నగిల్లుతున్న ఉపాధి ● ప్రభుత్వం పట్టించుకోవాలని వినతి



బొగ్గు సరఫరా లేక భూపాలపల్లిలో నిలిచిన లారీలు

భూపాలపల్లిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్‌లో లారీ యజమానులకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. రోజురోజుకూ వారు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వెయ్యి లారీలతో కళకళలాడిన భూపాలపల్లి పట్టణం నేడు వెలవెలబోతోంది. ప్రస్తుతం 600 లారీలు మాత్రమే ఇక్కడ నడుస్తున్నాయి. లారీల భారీ సంఖ్య తగ్గడంతో 400 మంది యజమానులతో పాటు వాటిపై ఆధారపడి జీవనం గడిపే మరో 800 కుటుంబాలు రోడ్డునపడ్డాయి. సింగరేణిపై ఆ సంస్థలో పనిచేసే కార్మికులే కాకుండా వారిపై పరోక్షంగా ఆధారపడే కుటుంబాలు వేలాదిగా ఉంటాయి. అందులో లారీ యజమానులు ఒకరు. భూపాలపల్లి ప్రాంతానికి సింగరేణి బొగ్గు గనులు వస్తున్నాయంటే.. తమకు ఉపాధి అవకాశాలు మెండుగా దొరుకుతాయని ఇక్కడి నిరుద్యోగ యువత సంబురపడ్డారు. ఈ క్రమంలోనే ఇక్కడి గనులకు తగ్గట్టుగా లారీలు, టిప్పర్లు కొనుక్కున్నారు. భూపాలపల్లిలో 1995లో బొగ్గు రవాణా మొదలైంది. ఈ నేపథ్యంలో స్థానికుల్లో కొందరు ఉపాధి అవకాశాల కోసం ఫైనాన్స్‌ల మీద, భూములు అమ్ముకొని కొంతమంది లారీలు, టిప్పర్లు కొనుగోలు చేశారు. అయితే.. మొదటగా 50లారీలతో మాత్రమే ప్రారంభమైన బొగ్గు రవాణా 2014లోగా సంఖ్య వెయ్యికి చేరింది. నాడు అన్ని లారీలకు బొగ్గు సరఫరా లభించి అందరూ బిజీబిజీగా పనులు చేసుకునే వారు. కానీ రాను రాను వ్యవస్థలో అనూహ్య మార్పులు రావడం, ఆన్‌లైన్ కోల్ టెండర్లు మొదలవడంతో కంపెనీలు వారికి నచ్చిన విధంగా బొగ్గు రవాణాను తీసుకెళ్లడం ప్రారంభించారు. గతంలో లారీలు, టిప్పర్లు తప్ప ప్రత్యామ్నాయం లేదు. దీంతో లారీ యజమానులంతా సంతోషంగా జీవనం గడిపేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. కోల్ ట్రాన్స్‌పోర్ట్ యజమానులు తామే టిప్పర్లు పెట్టుకుని తక్కువ ధరతో ఉప్పల్ రైల్వే స్టేషన్‌కు బొగ్గు రవాణా చేస్తున్నారు. ఇక్కడి నుంచి వివిధ కంపెనీలకు వ్యాగన్ల ద్వారా బొగ్గు వెళుతుంది. అలా కంపెనీలకు ట్రాన్స్‌పోర్ట్ ధర తక్కువ పడడంతో వారు అటువైపే మొగ్గుచూపుతున్నారు. దీంతో కేవలం బొగ్గు రవాణాపై మాత్రమే ఆధారపడి జీవనం గడుపుతున్న లారీ యజమానులు వారికి సరిపడా ట్రిప్పులు పడకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో నెలకు ఆరు ట్రిప్పుల వరకు పడితే.. ఇప్పుడు కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో డీజిల్ ఖర్చు, డ్రైవర్, క్లీనర్ వేతనం, వాహనం మెయిన్‌టెనెన్స్, ఇతరత్ర ఖర్చులు పోను నెలనెలా చెల్లించే ఈఎంఐ కట్టే పరిస్థితి లేకపోవడంతో సదరు సంస్థల యజమానులు నిర్దాక్షిణ్యంగా లారీలను లాక్కెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వెయ్యి వరకు ఉన్న లారీలు ఇప్పుడు బాగా తగ్గాయని అంటున్నారు.

- విలువ పెరిగి.. రవాణా తగ్గి..

బొగ్గు విలువ పెరిగి.. రవాణా తగ్గిందని లారీ యజమానులు చెబుతున్నారు. పక్క రాష్ట్రంలో టన్నుకు రూ.5,500 ఉండగా ఇక్కడ మాత్రం రూ.8,500 పలుకుతోందని అంటున్నారు. ఇక్కడి జీ-5 చాలా నాణ్యమైనది కావడం కూడా ఇందుకు కారణమని చెబుతున్నారు. అయితే ఈ బొగ్గును రవాణా చేయడానికి గతంలో లారీలు, టిప్పర్లు ద్వారా మాత్రమే సరఫరా జరిగేదని తెలిపారు. కానీ ఇప్పుడు కొంతమంది బడా కాంట్రాక్టర్లు చేస్తున్న వ్యాపారం మూలంగా తమపై భారం పడుతోందని ఆరోపిస్తున్నారు. భూపాలపల్లి నుంచి ఉప్పల్ రైల్వేస్టేషన్‌కు ప్రస్తుతం కాంట్రాక్టర్లు వేసుకున్న టెండర్ల ద్వారా టిప్పర్లు బొగ్గు రవాణా చేస్తున్నాయి. ఇందులో స్థానికులకు దక్కేది శూన్యమని తెలుస్తోంది.. బయటికి వెళ్దామంటే బొగ్గు రవాణా కావాలని అడిగే కంపెనీలు కూడా తక్కువయ్యాయి. చాలా వరకు వ్యాగన్ల ద్వారా మాత్రమే బొగ్గును తెప్పించుకునే వీలును కంపెనీలు కల్పించుకున్నాయి. దీంతో లారీ యజమానుల మీద తీరని ఆర్థిక భారం పడుతోంది. లారీలు అమ్ముకునే దుస్థితి వస్తుందని అంటున్నారు. ఇప్పటికే పలువురు అమ్మకోగా, మరికొంతమందివి ఈఎంఐలు చెల్లించకపోవడం మూలంగా సంబంధిత ఫైనాన్స్ కంపెనీలు లాక్కుపోయినట్లు తెలిపారు.

ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి..

- మేకల చంద్రయ్య, ది కాకతీయఖని లారీ అసోసియేషన్ అధ్యక్షుడు



గతంలో కంటే ఇప్పుడు 70 శాతం బొగ్గు రవాణాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నెలకు ఆరు ట్రిప్పులు బొగ్గు రవాణా జరిగేది. ఇప్పుడు రెండు ట్రిప్పులు మాత్రమే పడుతోంది. దీంతో మేము తీవ్రంగా నష్టపోతున్నాం. కనీసం నెల నెలా ఈఎంఐలు చెల్లించే పరిస్థితి లేదు. దీనిపై ప్రభుత్వమే చొరవచూపి సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి వివిధ కంపెనీలకు బొగ్గు సరఫరా మా ద్వారా జరిగేలా చర్యలు చేపట్టాలి. స్థానికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటే.. వేలాది కుటుంబాలు రోడ్డునపడే దుస్థితి దాపురిస్తుంది. వెంటనే దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

విద్యా మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

జనగామ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ విషయాలపై చర్చించడానికి డిసెంబరు 28, 29 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర విద్యా మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి కోరారు. ఆదివారం జనగామలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు, ఐదు డీఏల పెండింగ్, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ సమస్యలు పరిష్కరించబడలేదన్నారు. జీవో నం.317 బాధితులకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. విద్యారంగ విషయాలపై చర్చించడానికి డిసెంబరు 28, 29 తేదీల్లో జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర విద్యా మహాసభలు, రాష్ట్ర కమిటీ సమావేశాలలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, అధికారులు పాల్గొంటారన్నారు. ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్‌జీవోల పాత్ర పెరిగిపోతుందని, పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, కొన్ని గురుకులాల మీద మాత్రమే దృష్టి పెట్టడం సరికాదని, విద్యారంగంపై బడ్జెట్ పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మడూరి వెంకటేష్, విద్యాదేవి, సదానందం, సుధాకర్, మంగు జయప్రకాష్, శ్రీనివాస్, కృష్ణ, శ్రీహరి, సుధీర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, నీలకంఠం పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు : డీఏవో



గూడూరులో పంటను పరిశీలిస్తున్న డీఏవో అంబికాసోని

పాలకుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యసాయాధికారి కట్టా అంబికాసోనీ సూచించారు. ఆదివారం గూడూరు, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో నష్టపోయిన వరి పంటలను పాలకుర్తి ఏడీఏ పరశురాంతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తుఫాన్‌తో నష్టపోయిన పంటలను జిల్లా వ్యాప్తంగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటల దెబ్బతిన్నాయని తెలిపారు. మండలంలోని 3764 ఎకరాల వరి పంట, 2280 ఎకరాల్లో పత్తి పంట, 133 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. వ్యవసాయాధికారులతో సర్వే చేయించి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని అన్నారు.

ఘనంగా తులసి-దామోదర కల్యాణం

మరిపెడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం ఆదివారం ద్వాదశిని పురస్కరించుకొని మరిపెడ బంగ్లాలో రామాలయంలో లోక కల్యాణంకై దేవతమూర్తులు తులసి- దామో దర కల్యాణాన్ని ఆ ఆలయ వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. ఆంజనేయ స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా రాములోరి గుడిలోని ఆంజనేయస్వామికి ఆలయ అర్చకుడు సుదర్శన్ భట్టార్ ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హనుమాన్ చాలీసా జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఆలయ నిర్వాహకులు గంట్లా రంగారెడ్డి, ఉల్లి శ్రీనివాస్‌రావు, కొంపల్లి వేణు, దిలీప్, ఉల్లి విద్యారాణి, గర్రెపల్లి శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితుడు సుదర్శన్‌భట్టార్

నాసిరకం విత్తనాలతో మోసపోయిన రైతులు

వర్ధన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాసిరకం వరి విత్తనాలతో మోసపోయామని అన్నదాలు ఆందోళనకు దిగిన ఘటన వర్ధన్నపేటలో చోటు చేసుకుంది. వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని డీసీ తండాకు చెందిన సుమారు పది మంది రైతులు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాప్‌లో విత్తనాలు కొనుగోలు చేశారు. పంట కోసే సమయానికి దిగుబడి రాకపోవడంతో రైతులు ఆందోళన బాట పట్టారు. గింజశాతం తక్కువ ఉండి తాలు శాతం ఎక్కువ ఉన్న విత్తనాల కారణంగా తాము నష్టపోయామని సదరు ఫర్టిలైజర్ యజమానితో వాగ్వాదానికి దిగారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని నమ్మించి ఓ పట్టణ కేంద్రానికి చెందిన ఓ ఎరువుల షాపు యాజమాని అంటగట్టి తమను నిండా ముంచారని రైతులు వాపోయారు. నష్టపోయిన తమను అటు అధికారులు పట్టించుకోక ఫర్టిలైజర్ నిర్వాహకులు దాటి వేసేందుకు ప్రయత్నం చేశారని రైతులు తెలిపారు. నకిలీ విత్తనాలతో మోసపోయిన తమకు న్యాయం చేయడంతో పాటు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ వితనాలు అంటగట్టిన ఫర్టిలైజర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు

పాలకుర్తిలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న నర్సయ్య



చికిత్స పొందుతున్న రిషిక

పాలకుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో ఇద్దరు తీవ్ర గాయాల పాలైన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. మండల కేంద్రానికి చెందిన చిదురాల నర్సయ్య, విజయ దంపతులు. ఉదయం విజయ ఇడ్లీ చేసి గ్యాస్‌ను ఆఫ్ చేసింది. వంట గది నుంచి గ్యాస్ లీకై వాసన వస్తుండడంతో రెగ్యులేటర్‌ను ఎంత ఆపేందుకు ప్రయత్నం చేసినా లీకేజీ ఆగలేదు. వంట గదిలో పక్కనే ఉన్న దేవుడి వద్ద దీపం వెలిగించగా, ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలతోనే సిలిండర్ ను బయటికి తీసుకొచ్చి విసిరేశాడు. మంటలు చెలరేగిన క్రమంలో నర్సయ్యతోపాటు ఇంటిలో ఉన్న బంధువు బాలిక రిషికకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం స్థానికులు మంటలను ఆర్పేశారు. గాయపడిన నర్సయ్య, రిషికను పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అనంతరం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రిషికకు ఇంటికి తీసుకురాగా, తీవ్రంగా గాయపడిన నర్సయ్య ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పోలీస్‌స్టేషన్ ప్రహరీగోడకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జి.సత్యనారాయణరావు

గణపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ప్రహరీ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీనగర్ నుంచి జంగాలపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులకు రూ.20కోట్లు సీడీఎఫ్ నిధులు, హనుమాన్ కట్ట నుంచి కొత్తపల్లి వరకు రూ.18కోట్లతో మండల కేంద్రాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోని రెండు ఎకరాల స్థలంలో క్వార్టర్స్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంపత్‌రావు, సీఐ కర్ణాకర్‌రావు, ఎస్సై అశోక్, అమూల్య, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నీటి తొట్టిలో పడి వృద్ధుడి మృతి

సంగెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోహిత గ్రామంలో నీటి తొట్టిలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. లోహిత గ్రామానికి సైకిల్‌పై వచ్చిన గుర్తు తెలియని వృద్ధుడు (65) గామంలోని చావడి వద్దకు చేరుకోగానే అదుపుతప్పి నీటి తొట్టిలో పడిపోయాడు. గ్రామస్థులు పడిపోయిన వృద్ధుడిని పరిశీలించగా మృతి చెందినట్లు భావించి సంగెం ఎస్సై వంశీకృష్ణకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తొట్టిలోనుంచి తీసి ఒడ్డున చేర్చారు. మృతదేహాన్ని గుర్తు పట్టేందుకు లోహిత గ్రామ పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో వాట్సాప్‌ల ద్వారా ప్రచారం చేశారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు ఎస్సై వివరించారు.

కాళేశ్వరాలయంలో సందడి



క్యూలో నిల్చున్న భక్తులు



శుభానందదేవి ఆలయంలో మహిళా భక్తులు


మహదేవపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం భక్తజనం పోటెత్తారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు లక్ష వత్తుల పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి బిల్వ పత్ర పూజలు, కృత్తికా మాస పూజలు నిర్వహించారు. అనంతరం ఉసిరిక చెట్టు వద్ద లక్ష వత్తుల కార్యక్రమం నిర్వహించారు. శనివారం నుంచి ఐదు రోజుల పాటు స్వామివారికి గోదావరి నుంచి నీటిని తీసుకుని పంచ తీర్థ అభిషేకం చేస్తున్నారు. రెండో రోజు కూడా కార్యక్రమాన్ని చేపట్టారు.

హేమాచల క్షేత్రంలో కోలాహలం

మంగపేట నవంబరు02 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆదివారం సందడిగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. చింతామణి, ఎద్దుముక్కు జలపాతాల వద్ద స్నానాలు ఆచరించిన భక్తులు శిఖాంజనేయస్వామిని దర్శించుకుని లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రాజశేఖర శర్మ, పవన్ కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్ శర్మ భక్తుల నామ గోత్రాలపై అర్చనలు చేశారు. అనంతరం ఆలయ ఈవో ఆర్.మహేష్ అర్చక సిబ్బందితో కూడి కార్తిక మాసం సందర్భంగా భక్తులకు జాకెట్ ముక్క, తమలపాకు ఖర్జూరం, పోక, గాజులు, ప్రమిదలతో కూడిన వాయినాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఈవో మహేష్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది గణేష్, శేషు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు



లక్ష్మీ నరసింహస్వామి మూల విరాట్టు

వరం'గన్'!

(5వ పేజీ తరువాయి)

గన్ స్వాధీనం చేసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

మరోవైపు ములుగు జిల్లా కేంద్రంలో మూడు రోజుల కిందట కలెక్టరేట్ సమీపంలోని ఓ పాన్ షాపు వద్ద గన్‌తో బెదిరిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి గన్ స్వాధీనంతో పాటు ములుగు మండలానికి చెందిన వారిగా గుర్తించారు. వీరికి రౌడీషీటర్ సూరితో సంబంధాలు ఉన్నట్లుగా గుర్తించి విచారణ చేపట్టారు. శాయంపేట, ములుగు సంఘటనల్లో వరంగల్, ములుగు పోలీసులువిచారణ చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎక్కడెక్కడ ఎలాంటి దందాలు చేశారు..? ఎవరెవరు ఇంకేమైన హత్యలకు సుపారీలు ఇచ్చారా? అనే కోణంలో విచారిస్తున్నారు.

అవి.. బిహార్ తుపాకులే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా రోజులకు తుపాకుల కలకలం రేగింది. గన్ గ్యాంగ్‌కు ఎక్కడి నుంచి తుపాకులు వస్తున్నాయో పోలీసులు విచారణ తేలింది. బిహార్ నుంచి గన్ గ్యాంగ్‌కు తుపాకులు సరఫరా అవుతున్నట్లుగా గుర్తించారు. పోలీసులు అదుపులో ఉన్న నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు తుపాకులు సరఫరా చేస్తున్న వారిని కూడా పోలీసులు గుర్తించినట్లుగా సమాచారం. తుపాకులు సరఫరా చేస్తున్న వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బిహార్‌లో ఎక్కడి నుంచి ఏ రూట్లో తుపాకులు తీసుకువస్తున్నారో విచారిస్తున్నారు. సూరి గ్యాంగుకే తుపాకులు ఇచ్చారా..? ఇంకా ఎవరెవరికి బిహార్ నుంచి తుపాకులు విక్రయించారో ఆరా తీస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, కామారెడ్డి, మెదక్ తదితర జిల్లాల్లో తుపాకులు మోత మోగాయి. విచ్చలవిడిగా బిహార్ రాష్ట్రం నుంచి తుపాకులు తెలంగాణకు సరఫరా అవుతున్నాయని నిఘా వర్గాలు గుర్తించాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంకా ఎవరి చేతిలోకి బిహార్ తుపాకులు వెళ్లాయో..? అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో గందరగోళం

- సరైన వసతులు లేక ఇబ్బందుల్లో క్రీడాకారులు
- జూడో మ్యాట్లకు బదులు కబడ్డీ మ్యాట్ల ఏర్పాటు
- పోటీల్లో గాయపడ్డ అండర్-17 జూడో క్రీడాకారిణి కారుణ్య

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14, 17 ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ తోపాటు డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-14, 17 బాలబాలికల జిమ్నాస్టిక్స్, జూడో పోటీల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆదివారం డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో రెండో రోజు జరిగిన జూడో పోటీలను తూతూమాత్రంగా నిర్వహించారని క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్‌లు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులకు భోజన, బస, ఇతర సౌకర్యాలను కల్పించాల్సిన నిర్వాహకులు ఆ దిశగా ఏర్పాట్లను చేయలేదంటూ వివిధ జిల్లాలకు చెందిన క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. నామమాత్రపు మ్యాట్లు, కబడ్డీ మ్యాట్లను ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తున్నారు. దీంతో నల్లగొండ జిల్లాకుచెందిన అండర్-17జూడో క్రీడాకారిణి కారుణ్య జూడో పోటీల్లో తలపడే సమయంలో కిందపడిపోవడంతో ఎడమ చెయ్యికి బలమైన గాయమైంది. దీంతో ఆక్రీడాకారిణిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తమ బంధువులు తీసుకెళ్లి చికిత్స అందించారు. ఎస్‌జీఎఫ్ఐ నిర్వాహకులు నిర్లక్ష్యం కారణంగా క్రీడాకారిణి ఆస్పత్రి పాలు కావాల్సి వచ్చిందని నల్లగొండ జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి, జిల్లా బాలుర జూడో టీం కోచ్ షేక్ పర్వేజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌జీఎఫ్ఐ నియమ నిబంధనల ప్రకారం కొన్ని నెలల ముందే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహణ కోసం తేదీలను రూపొందిస్తూ స్పోర్ట్స్ క్యాలెండర్‌ను విడుదల చేస్తారు. దీంతో వివిధ జిల్లాలకు చెందిన ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. కాగా, హనుమకొండ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ-14,17 క్రీడా పోటీల కార్యదర్శి స్పోర్ట్స్ క్యాలెండర్ తేదీలను పరగణలోకి తీసుకోకుండా వివిధ క్రీడా సంఘాల బాధ్యులకు సమన్వయం, సమాచారం లేకుండానే అరకొర వసతులతో పోటీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో తాగునీరు లేక ఖాళీ నీళ్ల క్యాన్లతో క్రీడాకారులు

తిరుమలగిరిలో ఆధ్యాత్మిక శోభ

- బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న బుగులోని వెంకటేశ్వర స్వామి
- రేపటి నుంచి జాతర ప్రారంభం
- రెండో తిరుపతిగా ప్రసిద్ధి చెందుతున్న పుణ్యక్షేత్రం
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం





తిరుమలగిరి శివారులోని పాండవుల గుట్టలు, ఉత్సవ విగ్రహాలు

రేగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండో తిరుపతిగా ప్రసిద్ధి చెందింది తిరుమలగిరి పుణ్యక్షేత్రం. చుట్టూ రాతి కొండలు, పచ్చని ప్రకృతి అందాల నడుమ కొలువైన బుగులోని వెంకటేశ్వర స్వామి అశేష భక్తజనుల పూజలు అందుకుంటున్నాడు. ఏటా కార్తీక మాసంలో ఇక్కడ ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు ఇక్కడ జాతర జరగనుంది.

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులో వేల ఏళ్ల కిందట ముక్కిడి గుడి గడ్డ ప్రాంతంలో స్వామి వారు పూజలు అందుకున్నట్లు స్థానికులు చెబుతారు. రెండేళ్ల క్రితం వరకు ఇక్కడ శిథిలమైన ఆలయం ఉంది. గ్రామంలో మహిళలు బియ్యం దంచుతుండగా రోకల్లు, చాటల శబ్ధాలకు స్వామివారు గుట్టపైన ఉన్న గుహలో దాక్కున్నారని గ్రామస్థులు చెబుతుంటారు. గుహలో లోతుగా ఉన్న సందులో రాతిబండకు స్వామి వారు స్వయంభూగా ఏర్పడ్డారని భక్తులు నమ్ముతుంటారు. లోతుగా ఉండే ప్రాంతాన్ని ప్రాచీన భాషలో బుగులు అని పిలుస్తారు. అందుకే.. స్వామి వారు బుగులోని వెంకటేశ్వరుడిగా ప్రసిద్ధి చెందారు.

పర్యాటకులను ఆకర్షించే ప్రకృతి సౌందర్యం

బుగులోని వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలకు వచ్చే భక్తులను అక్కడి ప్రకృతి సౌందర్యం ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. చుట్టూ ఎటు చూసినా ఎత్తైన కొండలు, పచ్చని చెట్లు, పక్షుల కిలకిలరావాలు మానసిక ఆహ్లాదాన్నిస్తాయి. నిత్యం యాంత్రిక జీవనంలో మునిగిపోయేవారు ఇక్కడికి వచ్చి ఎంతో ఉల్లాసంగా గడుపుతారు. బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరకు ఆనుకుని దేశంలో జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందిన పాండవుల గుట్టలు ఉంటాయి. జాతరకు వచ్చిన భక్తులు పాండవుల గుట్టలపై ట్రెక్కింగ్ చేసి రాతికొండల రమణీయతను ఆస్వాదిస్తారు. అక్కడ ఉన్న పురాతన రాతి చిత్రాలు కూడా వీక్షిస్తారు. హిమాలయాల కంటే పూర్వం ఏర్పడ్డ అరుదైన శిలాతోరణం కూడా పాండవుల గుట్టల్లో ఉన్న అరుదైన సంపదను చూడొచ్చు.



స్వామి వారి స్వాగత తోరణం

4 నుంచి 8 వరకు జాతర

కార్తీక మాసంలో నవంబరు 4న బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 8న ముగుస్తాయి. 4వ తేదీన స్వామి వారిని తిరుమలగిరి నుంచి గుట్టవద్దకు ఊరేగింపుగా తీసుకొస్తారు. 5న నిత్య పూజలు, 6న ఏనుగు, గుర్రం వాహనాలఊరేగింపు, 7న నిత్య పూజలు, మొక్కుబడులు, 8న నిత్యపూజలు, మొక్కుబడులు ఉంటాయి. అనంతరం సాయంత్రం స్వామి వారిని తిరుమలగికి ఊరేగింపుగా తీసుకొస్తారు.

భక్తులకు సకల సౌకర్యాలు

బుగులోని వెంకటేశ్వరసామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రూ.7.90 కోట్లు కేటాయించారు. ఎన్నడూలేని విధంగా జగ్గయ్యపేట, తిరుమలగిరి గ్రామాల నుంచి బుగులోని జాతరకు, అలాగే పాండవుల గుట్టల నుంచి బుగులోని జాతర వరకు రూ.5 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రూ.2 కోట్లతో మెట్ల వెడల్పు, ఆర్‌వోఆర్ వాటర్‌ప్లాంటు, కోనేరు, బావిని ఏర్పాటు చేశారు. రూ.90 లక్షలతో సెంట్రల్ లైటింగ్, కల్యాణ కట్ట, కల్యాణ మండపం, మరుగుదొడ్లను నిర్మించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిధులు మంజూరు చేసి శాశ్వత ఏర్పాట్లు చేశారు.

స్వామి వారి ఆశీస్సులు పొందాలి

– గంగుల రమణారెడ్డి, బుగులోని జాతర చైర్మన్



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో ఇప్పటి వరకూ ఏ ఎమ్మెల్యే చేయని విధంగా బుగులోని వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక్కడికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధ్యాత్మిక అనుభూతి, ప్రకృతిలో పరవశించి ఆనందం పొందేలా సౌకర్యాలు సమకూర్చాం. ప్రతి ఒక్కరూ వచ్చి స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరుతున్నాం.

మేడారంలో సందడి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



పార్కింగ్ స్థలాలను చదును చేస్తున్న డోజర్

వనదేవతలకు భక్తుల మొక్కులు

తాడ్వాయి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకొని సమ్మక్క-సారలమ్మల నామస్మరణలతో గద్దెలకు చేరుకున్నారు. ఎత్తు బంగారం (బెల్లం), కొబ్బరికాయలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 10వేల మందికి పైగా భక్తులు తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

గద్దెల దర్శనం దారి మళ్లింపు

మేడారం వనదేవతల దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ముఖ ద్వారాలను తొలగించారు. ఈ క్రమంలో ప్రతి రోజూ వస్తున్న భక్తులకు దర్శన సౌకర్యార్థం అధికారులు దేవస్థానం వెనుకాల నుంచి దారి మళ్లించారు. దీంతో పలువురు భక్తులు దారి తెలియక అయోమయానికి గురయ్యారు. వారిని, వీరిని అడుగుతూ ముందుకు సాగారు. దారి మళ్లించినప్పుడు సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తే తమకు సౌకర్యంగా ఉండేదని భక్తులు అంటున్నారు.

పోలీస్ పార్కింగ్ స్థలాల ఏర్పాటు

మేడారం ప్రీ జాతరకు ముందుగానే వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలగకండా పోలీస్ అధికారులు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. జంపన్నవాగు నుంచి గద్దెల సమీపం వరకు 1500 వాహనాలు నిలిచేలా పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానంలో పునరుద్ధరణ పనులు కొనసాగుతుడటంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

ఆధునిక పద్ధతిలో బావుల పూడికతీత

మహా జాతరకు భక్తుల సౌకర్యాల ఏర్పాటులో భాగంగా జంపన్న వాగులో ఉన్న ఇన్ఫిల్టరేషన్ బావుల పూడికతీతను అధికారులు ప్రారంభించారు. గత జాతరలో విధంగా కాకుండా ఆధునిక పద్ధతిలో పూడికతీత మోటార్లను వినియోగిస్తున్నారు. కార్మికులు నీటిలో మునిగి ఇసుకను తీయకుండా ఈ మోటార్లతో నీటితో పాటు ఇసుకను బయటకు తొలగిస్తున్నారు.

పరకాల బిడ్డకు ప్రతిష్ఠాత్మక అవార్డు

- కేసు దర్యాప్తులో ఐపీఎస్ శ్రవణ్ దత్ అసమాన ప్రతిభ
- అభినందించి అవార్డు అందజేసిన కేంద్ర ప్రభుత్వం



పరకాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నందూరు బార్ జిల్లా ఎస్పీగా పని చేస్తున్న శ్రవణ్ దత్‌కు కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. 2025 సంవత్సరానికి ఉత్తమ దర్యాప్తు విభాగంలో కేంద్ర గృహ మంత్రి దక్షత పతకాన్ని న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల పట్టణానికి చెందిన సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రవణ్ దత్.. తొలుత ఆరున్నర ఏళ్లపాటు ఐటీ రంగంలో పనిచేశారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో రెండేళ్లు పనిచేసి ఉద్యోగం వదులుకొని సివిల్స్ రాశారు. 2015లో సివిల్స్ విజేతగా నిలిచి ఐపీఎస్‌కు ఎంపిక అయ్యారు. 2016 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి శ్రవణ్ దత్ సివిల్స్‌కు ఎంపికైన తరువాత మహారాష్ట్ర కేడర్‌లో పర్భణి జిల్లా జింతూరులో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరి ఒక క్లిష్టమైన నేరకుట్ర, హత్య కేసును అత్యంత నైపుణ్యంతో దర్యాప్తు చేసినందుకు గాను అవార్డుకు ఎంపికయ్యారు.

2021, మే నెలలో రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించినట్లు కేసు నమోదు అయింది. ఇదే కేసు అదే ఏడాది జూలై నెలలో శ్రవణ్ దత్‌కు విచారణకు వచ్చింది. ఫోరెన్సిక్, డిజిటల్, భౌతిక ఆధారాల సమగ్ర విశ్లేషణ ద్వారా నేరకుట్ర, హత్య అని నిర్ధారించారు. దీనిపై ఐపీసీ 302, 120బీ సెక్షన్‌లు చేర్చి మూడు వారాల్లోనే నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. 70 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును బాంబే హైకోర్టు (ఔరంగబాద్ బెంచ్) పర్యవేక్షణలో విచారణకు వెళ్లింది. 2024లో నలుగురు నిందితులను హత్య, నేరకుట్ర నేరాల కింద రెండు జీవితఖైదు శిక్షలకు దోషులుగా పర్భణి సెషన్స్ కోర్టు తేల్చింది. అప్పటి ఏసీపీ శ్రవణ్ దత్ దర్యాప్తును ప్రత్యేకంగా ప్రశంసించింది. సంఘటనల గొలుసును శాస్త్రీయంగా పునర్నిర్మించిన విధానాన్ని అభినందించింది. ఇలాంటి అసాధారణ దర్యాప్తు నైపుణ్యం, కర్తవ్య నిష్ఠ, వృత్తి ప్రావీణ్యానికి గుర్తింపుగా అవార్డు దక్కింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాల పట్టణానికి చెందిన సోద శ్రవణ్ దత్‌కు కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కం పట్ల కుటుంబీకులు, చిన్ననాటి స్నేహితులు, పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డీఆర్‌డీవో ఆదేశాలు బేఖాతరు

- వీవోఏలను తొలగించాలనే తీర్మానంపై నిర్లక్ష్యం
- ఏపీఎం, వీవోలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

శాయంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కాట్రపల్లి, శాయంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గత రబీ సీజన్‌లో రూ.కోట్లలో అక్రమాలు జరిగాయి. దీంతో నిందితులపై శాయంపేట పీఎస్‌లో కేసు నమోదైన విషయం విదితమే. అనంతరం శాఖాపరమైన చర్యల్లో భాగంగా శాయంపేట, కాట్రపల్లి గ్రామాల సెంటర్ ఇన్‌చార్జులైన వసుంధర గ్రామైఖ్య సంఘం వీవోఏ బలభద్ర హైమావతి, జ్యోతి గ్రామైక్య సంఘం వీవోఏ అల్లె అనితలను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను గత అక్టోబరు 18న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సంబంధిత వీవోఏల వద్ద పుస్తకాలు స్వాధీనపరుచుకుని, వీవో పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వీవోఏలను తొలగిస్తూ చేసిన తీర్మానాలను వెంటనే జిల్లా కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

ఈ ఆదేశాలు మంజూరు చేసి 15 రోజులు గడిచినా ఇప్పటికీ అక్రమాలు చేసిన వీవోఏలను తొలగిస్తూ తీర్మానాలు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్‌డీవో ఉత్తర్వులు జారీ చేసినా పట్టింపు లేకుండా ఉన్నారని మండలంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కన్నీటి పంట!

- అకాల వర్షాలతో చిత్తవుతున్న అన్నదాత
- మొంథా తుఫాన్‌తో చేతికొచ్చిన పంటలు నేలపాలు
- తీవ్రంగా నష్టపోయిన నాలుగు జిల్లాల రైతులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 97వేల ఎకరాల్లో నష్టం

హనుమకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో పంటలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రధానంగా చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయి. చేతికాడికి వచ్చిన బువ్వ నోటికి అందకుండా పోయింది. ప్రాథమిక అంచనాల ప్రకారం వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో 1,23,045 ఎకరాల మేర పంట నష్టం జరిగింది. ఇందులో అత్యధికంగా దెబ్బతిన్నది వరి పంటనే. 86,131 ఎకరాల వరి పంట చేతికి రాకుండా పోయింది. 24,609 ఎకరాల్లో పత్తి ధ్వంసం అయింది. 12,304 ఎకరాల మొక్కజొన్న ఇతర పంటలు అక్కరకురాకుండా పోయాయి. వరంగల్ జిల్లాలో 35,000 ఎకరాలు, హనుమకొండ జిల్లాలో 35,000 ఎకరాలు, జనగామ జిల్లాలో 25,816 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 26,029 ఎకరాల మేర పంట నష్టమైంది. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో తుఫాన్ ప్రభావం తక్కువగా ఉండడంతో ఇక్కడ పెద్దగా పంట నష్టం జరగలేదు. ములుగు జిల్లాలో 600 ఎకరాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 600 ఎకరాల వరకు పంటలకు నష్టం జరిగింది.

రూ.10వేలు ఏ మూలకు..

ప్రకృతి వైపరిత్యాల వల్ల పంటలకు తీవ్ర నష్టం జరిగినప్పుడు అన్నదాతలను ఆదుకునేది పంటల బీమా మాత్రమే. దీనిని అమలు చేయడంలో రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10,000 చెల్లించనున్నట్లు ఇటీవల వరంగల్ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ సాయం ఏమూలకు సరిపోతుందని రైతులు వాపోతున్నారు. పంటల సాగుకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఇతర సస్యరక్షణ చర్యలపైన రైతులు ఎకరానికి రూ.20 నుంచి రూ.30వేల వరకు ఖర్చు చేశారు. యూరియా దొరక్క ఆగచాట్లు పడ్డారు. వ్యవసాయ పనుల కోసం రైతులు ఒళ్లంతా హూనం చేసుకున్నారు. అయినా ఫలితం దక్కలేదు. పంటలకు నష్టం జరిగినప్పుడల్లా ఎకరాకు రూ.10,000 విదిల్చడం ప్రభుత్వానికి పరిపాటి అయింది.



మహబూబాబాద్ జిల్లా గార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు (ఫైల్)





చెన్నారావుపేట మండల కేంద్రంలో నీట మునిగిన పత్తి పంట, ఎల్కతుర్తి మండలంలో వరి పొలాల పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

పంటల బీమా ఏదీ?

వాతావరణ ఆధారిత బీమా పథకాని దేశ వ్యాప్తంగా పాడి, మత్స్య రంగాలకు వర్తింపజేయాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మన రాష్ట్రంలో 2020 నుంచి ఫసల్ బీమానే అమలు కావడం లేదు. తాము అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని అమలు చేస్తామని గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇవ్వగా.. నాలుగు సీజన్లు గడిచినా ఇప్పటివరకు అమలులోకి రాలేదు. గతంలో బీమా కంపెనీకి రైతులు 50 శాతం, కేంద్రం 25శాతం, రాష్ట్రం 25శాతం చొప్పున ప్రీమియం చెల్లించేవి. కాగా, మొత్తం ప్రీమియం రైతుల పక్షాన ప్రభుత్వమే భరిస్తుందని హామీలో పేర్కొన్నారు. ఆ హామీని అమలు చేస్తేనే ఇలాంటి సమయంలో ఊరట కలుగుతుంది.

అందని పరిహారం

గతంలో రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో ఉమ్మడి జిల్లాలో 9 పంటలకు బీమా అమలైన ఉదంతాలున్నాయి. 2020 వరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా ద్వారా వరి, మొక్కజొన్న, వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, వాతావరణ ఆధారిత బీమా ద్వారా మామిడి, వానాకాలంలో పత్తి, మిరపకు కూడా బీమా భరోసా ఉండేది. కొన్ని సీజన్లుగా బీమా పథకం అమలు చేయకపోవడం వల్ల ఈదురుగాలులు, అకాల వర్షాలు, వరదలు, వడగళ్లు, ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు తదితర ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు ఆసరాకరువైంది. పంటలుదెబ్బతిన్నప్పుడు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుండగా.. అరకొర వివరాల నమోదు, నష్టం 33 శాతం దాటిన పంటలకే వర్తింపజేయడంతో సాయం అందడం లేదు. 2023 వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 50వేల ఎకరాల్లో పంట నష్టపోతే కేవలం 1082 ఎకరాలకు మాత్రమే పరిహారం అందడం చూస్తే రైతులకు ఏమాత్రం సహాయం అందుతున్నదో అర్థమవుతుంది. గతంలో మండలం, జిల్లా యూనిట్‌గా పంటల బీమా అమలు చేయకగా సరైన పరిహారం అందలేదు. న్యాయంగా సాయం అందాలంటే రైతువారీగా లేదా కమతం, సర్వే నెంబర్ల వారీగా బీమా పథకం అమలు చేయాల్సి ఉంది. ఈయాసంగిలో పంటల బీమాను అమలు చేయాలంటే డిసెంబర్ 15లోగా నోటిఫికేషన్ వెలువరించాల్సి ఉంటుంది. పంటలకే కాకుండా కుటుంబసభ్యులకు రూ.2లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం సంభవిస్తే రూ.1.25 లక్షల పరిహారం, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితరాలకు పరిహారం ఇచ్చేలా అమలులో ఉన్న యూనిఫైడ్ బీమా పథకాన్ని కూడా అమలు చేస్తేనే తమకు ఊరట కలుగుతుందని రైతులు కోరుతున్నారు.

శరవేగంగా సర్వే

మొన్నటి భారీ, అతిభారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల సర్వే ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. మంగళవారం నాటికి సర్వేను పూర్తి చేసి నివేదికలను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు వ్యవసాయ విస్తరణాధికారులు, సహాయ వ్యవసాయ విస్తరణాధికారులు వర్షప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి సమాచారం తీసుకుంటున్నారు. ఈసారి దెబ్బతిన పంటల సర్వే కచ్చితంగా, పారదర్శకంగా అవకాశం ఉంది. గతంతో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించకపోయినా తమకు తోచిన వివరాలను రాసి పంపేవారు. ఈ సారి అలా కుదిరేలా లేదు. ఇటీవలే పంటల లెక్క పక్కాగా జరిగింది. ఈ డిజిటలైజ్ సర్వే సందర్భంగా ప్రతీ పంట విస్తీర్ణం, పంట రకం, సర్వే నెంబర్, రైతుల పూర్తివివరాలతోపాటు పంట ఫొటోను కూడా క్యాప్చర్ చేసి ప్రత్యేక యాప్‌లో నమోదే చేశారు. ఇవన్నీ కంప్యూటర్‌లో స్పష్టంగా నిక్షిప్తమై ఉన్నాయి. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను ఈ వివరాలతో పోల్చితే పంట దెబ్బతిన్నదీ తేనిది స్పష్టంగా తెలిసిపోతుంది. ఒక వేళ పంట నష్టం జరిగినా జరగలేదని నమోదు చేస్తే రైతు ఫిర్యాదు మేరకు క్రాప్ బుకింగ్ సందర్భంగా తీసి ఫొటోలే సాక్ష్యంగా నిలుస్తాయి. భారీవర్షాలకు ముందు పచ్చగా ఉన్న పొలం.. వర్షాల తర్వాత నేలపాలై ఉన్నా ఆదేం లేదని రాస్తే ఆ విషయాన్ని క్రాప్ బుకింగ్ సందర్భంగా తీసిన ఫొటోలే రుజువు చేస్తాయి. దీంతో ఏఈవోలు, ఏఏఈవోలు.. ఏ మాత్రం తేడా రాకుండా సర్వే చేస్తున్నారు. సర్వే అనంతరం పంటల నష్టం ఏమేరకు ఉందనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దెబ్బతిన్న పంటల విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అభిప్రాయపడుతున్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సోడా కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో సోడా కార్మికుల యూనియన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ సోడా కార్మికులకు అడ్డాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో మూడు నెలలు సీజనల్‌లో వ్యాపారం ఉంటే మిగతా తొమ్మిది నెలలు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి అని చెప్పారు. ముత్తయ్య, అఫ్జల్, మహబూబ్‌పాషా, నారాయణ, శ్రీను, భిక్షపతి, షైబెల్లి, వెంకన్న, నాగేష్, వెంకటాద్రి, రాజు, పద్మ, ఐలయ్య, బాష పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

జనగామ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం జనగామలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముఖ్యనాయకులు సమావేశం నిర్వహించగా దశమంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉడుగుల రమేశ్, శివరాజ్ యాదవ్, పవన్ శర్మ పాల్గొన్నారు.

అక్కడ అధికం.. ఇక్కడ సాధారణం

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ వానాకాల సీజన్‌లో మహబూబాబాద్ జిల్లాలో అధిక వర్షాలు పడుతూనే ఉన్నాయి. రుతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాన్‌ల ప్రభావంగా సాధారణ వర్షాల నుంచి అధిక వర్షాలు పడుతున్నాయి. కొన్ని మండలాల్లో అత్యధిక వర్షాలు పడుతుండగా, మరికొన్నిమండలాల్లో అధిక వర్షాలు పడుతున్నాయి. మరో మూడు మండలాల్లో మాత్రం సాధారణ వర్షపాతం నమోదు కావడం గమనించదగ్గ విషయం. జిల్లాలో జూన్ నెల నుంచి అక్టోబర్ 31 వరకు 919.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కాగా, ఇప్పటి వరకు 1253.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 18 మండలాల్లోని నాలుగు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మరో 11 మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, మరో మూడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. అయితే జిల్లాలో కేసముద్రం మండలంలోనే అత్యధికంగా వర్షం కురిసి జిల్లాలోనే టాప్‌స్థానంలో నిలిచింది.



కేసముద్రం మార్కెట్ ముందు చెరువును తలపిస్తున్న వరద నీరు (ఫైల్)

జిల్లాలోని నాలుగు మండలాల్లో అత్యధిక వర్షం కురిసింది. కేసముద్రంలో గత జూన్ నెల నుంచి అక్టోబర్ 31 వరకు 920.2 మిల్లీమీటర్ల వర్షం కురియాల్సి ఉండగా 1542.4మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇది జిల్లాలోనే 68 శాతం అత్యధిక వర్షపాతంగా రికార్డ్‌లోకి ఎక్కింది. డోర్నకల్‌లో 850.9 కురియాల్సి ఉండగా, 1401.9 మిల్లీమీటర్లు (69.0 శాతం) గార్లలో 963.1 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా, 1558.9 (62.0 శాతం) కురిసింది. గూడూరులో 1122.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 1798.2 మిల్లీమీటర్లు (60.0 శాతం) అధికంగా పడింది.

జిల్లాలోని 11 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. కొత్తగూడ, గంగారం, బయ్యారం, కురవి, నెల్లికుదురు, చిన్నగూడూరు, మరిపెడ, తొర్రూరు, పెద్దవంగర, సీరోలు, ఇనుగుర్తి మండలాల్లో అధిక వర్షం కురిసింది. దాంతో చెరువులు, కుంటలు నీటితో నిండి అలుగులు పోశాయి.

మహబూబాబాద్, నర్సింహులపేట, దంతాలపల్లిలో సాధారణ వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్‌లో 989.4 మిల్లీమీటర్ల వర్షం కురియాల్సి ఉండగా 1122.7 మిల్లీమీటర్ల వర్షపాతం (13.0 శాతం) తక్కువ కురిసింది. నర్సింహులపేటలో 791.4 మిల్లీమీటర్లు కురియాల్సి ఉండగా 880.6 మిల్లీమీటర్ల (11.0 శాతం) కురిసింది. దంతాలపల్లిలో 819.9 మిల్లీమీటర్లకు గాను 932.4 మిల్లీమీటర్లు (14 శాతం) మాత్రమే పడింది.

నెలల వారీగా..

జూన్ నెలలో వానాకాలం ప్రారంభమైంది. మొదటి జూన్ నెలలో జిల్లా వ్యాప్తంగా 139.8 మిల్లీమీటర్ల వర్షంపడాల్సి ఉండగా 91.6 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. అంటే మైనస్ 34 మిల్లీమీటర్ల వర్షపాతం తక్కువగా పడింది. జూలై నెలలో 250.5 వర్షం పడాల్సి ఉండగా 293.0 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఈ నెలలో 17 శాతం ఎక్కువగా వర్షం పడింది. ఆగస్టు నెలలో 247.4 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 345.4 మిల్లీమీటర్లు (40 శాతం) ఎక్కువ వర్షం పడింది. సెప్టెంబర్ నెలలో 181.8 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 228.9 మిల్లీమీటర్లు (26 శాతం) ఎక్కువ వర్షం కురిసింది. అక్టోబరు నెలలో 38.4 మిల్లీమీటర్ల వర్షం కురియాల్సి ఉండగా 295.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. ఈ అక్టోబరు నెలలో 200 శాతం అతిభారీ వర్షాలు కురిసాయి. ఏది ఏమైనా జిల్లా అంతటా అత్యధిక వర్షాలు కురిస్తే మూడు మండలాల్లో సాధారణ వర్షం కురియడం గమనార్హం.

రబీకి ఢోకా లేదు

పనికర యాకమల్లు, రైతు, కోరుకొండపల్లి



ప్రతీ ఏడాది పంటలు పూర్తి కావడం, రబీకి సరిగా నీరు అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడేవాళ్లం.. నీటి కోసం అరిగోస పడేవాళ్లం ఈ సారి అలా కాకుండా వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు, నిండిపోయాయి. దీంతో యాసంగి పంటలకు సాగునీరు కొరత తీరనుంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి లక్ష్మీపురం గ్రామ శివారు గామ్యతండాకు చెందిన మహిళ సపావత్ పేరమ్మ (42) జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మానుకోట రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. గామ్యతండాకు చెందిన సపావత్ కిషన్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య పేరమ్మ, రెండో భార్య జ్యోతి. కుటుంబ కలహాలతో ఈనెల 23న రెండో భార్య జ్యోతి పురుగులు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొంది 28న డిశ్చార్జ్‌అయి ఇంటికి వెళ్లింది. అదే రోజున మొదటి భార్య పేరమ్మ ఇంటి వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. భర్త కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక సాయం చేసిన అయ్యప్ప సేవా సమితి

కొత్తగూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మృతుడి కుటుంబానికి అయ్యప్ప సేవా సమితి సభ్యులు రూ.10వేలు ఆర్థిక సహయం చేశారు. మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన భూర్క ప్రశాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రశాంత్ కుటుంబానికి అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఆదివారం రూ.10వేలు ఆర్థిక సహయం చేశారు. ఇంటిచుట్టు గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. యాదగిరి గోవర్ధన్, వాసం వీరాస్వామి, యాదగిరి కిరణ్, వాసం సురేష్, గుగులోత్ వీరన్న, డాక్టర్ కృష్ణ, వాసం వెంకన్న, బానోత్ నరేష్, అజ్మీరా రమేష్‌నాయక్, రాజన్న నాయక్ పాల్గొన్నారు.

'ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి'

దంతాలపల్లి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఖరీఫ్ సాగులో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ జెట్టి ఆజాద్‌చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం తన వంతు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వీధిలైట్లు, కేబుల్ వైర్లు ఏర్పాటుకు శ్రీకారం చుడతామన్నారు. ప్రభుత్వ పరంగా రైతులకు న్యాయం జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం కమిటీ ఎన్నిక



రావుల మల్లేశం అధ్యక్షుడు

ఇనుగుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యుల సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు రవీంద్రాచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా రావుల మల్లేశం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చిదురాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పొలెపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా బుచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా ఏకాంతం, ప్రచార కార్యదర్శిగా పాల సంపత్, జిల్లా కమిటీ సభ్యుడిగా చిరగోని యాకసాయిలు, కార్యదర్శిగా వనం సంపత్, గౌరవ సలహాదారులుగా కుసుమ సారంగపాణి, వెంకటయ్య, భిక్షపతి, కార్యవర్గ సభ్యులుగా బండి శ్రీను, షాబుద్దీన్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ లను ఎన్నుకున్నారు.



బకాయిలు చెల్లించాలని దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



మహబూబాబాద్‌లో గేదెకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

'ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఆదివారం నిరసన తెలిపి గేదెకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 3న జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పవన్, రాకేష్, వంశీ, అనిల్, వినయ్, ప్రకాష్ పాల్గొన్నారు.

● కురవి : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దున్నపోతుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు మాట్లాడారు. రాష్ట్రంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. దీంతో తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కొలిపాక వీరేందర్, నాయకులు గణేష్, వాసు, వినయ్, జ్యోతి, సరస్వతి, మేఘన పాల్గొన్నారు.

మానుకోట గంగపుత్ర ఫిషర్‌మెన్ సంఘం అధ్యక్షుడిగా రాధాకృష్ణ



రాధాకృష్ణ అధ్యక్షుడు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మానుకోట గంగపుత్ర ఫిషర్‌మెన్ సంఘం అధ్యక్షుడిగా దేశబోయిన రాధాకృష్ణ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవనంలో ఆదివారం సంఘం సభ్యులంతా సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పొక్కుల శ్రీనివాస్, కోశాధికారిగా దేశబోయిన శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. కాగా, ఎన్నికల అధికారిగా గుడిబోయిన వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ గంగపుత్ర సంఘం బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంజనీరింగ్‌లో శ్రీనుకు డాక్టరేట్



కేసముద్రం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటగిరికి చెందిన భూక్య శ్రీనుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ లభించినట్లు ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. ఓయూ ప్రొఫెసర్లు జి.మల్లేషం, టి.మురళీకృష్ణ పర్యవేక్షణలో 'ఫజీ లాజిక్ బేస్డ్ ఈ-స్టాట్ కామ్ ఫర్ పవర్ ఫ్లో కంట్రోల్ ఆఫ్ గ్రిడ్ కనెక్టెడ్ విండ్ ఎనర్జీ సిస్టం' అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంలో ఆయనకు డాక్టరేట్ లభించినట్లు చెప్పారు. మారుమూల గ్రామంలోని తండాకు చెందిన గిరిజన యువకుడు డాక్టరేట్ సాధించడంపట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో దేవాలయ ట్రస్టు ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తాటిపాముల నర్సింహమూర్తి వేదమంత్రోచ్ఛరణల నడుమ విరాట్ విశ్వకర్మ పరమేశ్వర యజ్ఞ మహోత్సవ పూజా కార్యక్రమాన్ని ఆలయ ట్రస్టు చైర్మన్ పమ్మి సనాతనాచారి-అనురాధ దంపతులు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాధవాచారి, లక్ష్మణాచారి, సోమయ్యాచారి, రాజమౌళి, పూర్ణచందర్, సోమేశ్వరచారి, సుదర్శనాచారి, నాగేశ్వరచారి, ప్రశాంత్, రాజేష్, హరికృష్ణ, హరికిషన్, సతీష్, వీరభద్రాచారి, చిరంజీవాచారి, రత్నమాచారి, ఉపేంద్రాచారి, మోహనాచారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థులు

డోర్నకల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిల్కోడు మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అండర్-14 విభాగంలో ఫుట్‌బాల్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చావ కృష్ణ భాను, పీడీ గోవర్దన్ తెలిపారు. బాలుర విభాగంలో మోడల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న పి.రితికేష్, మారుతి సాయి, బాలికల విభాగంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని స్రవంతి ఎంపికైనట్లు వివరించారు. ముగ్గురు విద్యార్థులు ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తరపున ఈ 3వ తేదీ నుంచి 5 వరకు వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు



కంబాలపల్లిలో మాట్లాడుతున్న ఎన్డీ నేతలు

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : అమరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లిలో శనివారం రాత్రి అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత గ్రామంలో ఆటపాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం ఎందరో వీరులు తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారని చెప్పారు. ఆదివాసీ గిరిజనులకు పోడు భూములు కొట్టి పేద ప్రజలకు పంచిన ఘనత ఎన్డీ పార్టీకే దక్కిందన్నారు. అలాంటి అమరవీరుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పాటు పడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుజ్జు దేవేందర్, సోమ నర్సయ్య, హెచ్.లింగన్న, భట్టు చైతన్య, పర్వత కోటేష్, నాగరాజు, యాకయ్య, లింగన్న, మహేష్, ఎల్లయ్య, కళమ్మ, యశోద, ఉమ, తిరుపతి, దిలీప్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడలకు మోదుగులగూడెం విద్యార్థులు

కురవి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మోదుగులగూడెం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం సత్యనారాయణచారి తెలిపారు. డోర్నకల్‌లో ఈ నెల 1న జరిగిన సెలక్షన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చరణ్, ఐలి సౌజన్యలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈనెల 3 నుంచి వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు శ్రీరాములు, లత, సలీమ్, ఇందిరా, వీరన్న, దీపిక, రజిత, భాగ్యలక్ష్మి, బాలాష్టి రమేష్, టి.రమేష్, అభినందించారు.

జలసౌందర్యాన్ని వీక్షిస్తూ..



బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి

వాజేడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నయాగరా బొగత జలపాతం వద్ద ఆదివారం సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ప్రకృతి సౌందర్యాన్ని వీక్షించారు. వర్షాలు తగ్గుముఖం పట్టి జల ధారల ప్రవాహం తగ్గడంతో సందర్శకుల సంఖ్య కూడా స్వల్పంగానే ఉంది. జలపాతం ముందు భాగంలో ఉన్న ఈత కొలనులో పర్యాటకులు జలకాలాడుతూ సందడి చేశారు. జలపాతం అందాలను కెమరాలలో బంధించి మురిసిపోయారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



ఉసిరి వనంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ధన్నసరి శివారులోని ఉసిరి వనంలో ఆదివారం 108 జంటలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను మహబూబాబాద్‌కు చెందిన శ్రీమహాలక్ష్మి గణపతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజలకు ఎమ్మెల్యేమురళీనాయక్ హాజరై మాట్లాడారు. కార్తీక మాసంలో ఉసిరిచెట్టు కింద వ్రతాలు చేయడం శుభప్రదమని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శ్రీరంగం వేంకట నాగేశ్వర్‌రావు, రామారావు, సోమ శ్రీనివాస్, రాంబాబు గుడిపాటి లక్ష్మినారాయణ, జంగాల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

కేసముద్రం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దమోరీ తండాలో ఇటీవలె మృతి చెందిన లకావత్ ఈర్య, శంకర్ కుటుంబాలకు 75 కిలోల బియ్యం, రూ.4వేల నగదును సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ మండల నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయన వెంట గుగులోత్ హన్స్సేన్, లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ ధరావత్ బాలు, వెంకన్న, రెడ్యా, శ్రీను, శంకర్, ప్రవీణ్, కంటిపూడి అరుణ్‌కుమార్, అందె గురవయ్య, బండారి ప్రభాకర్ ఉన్నారు.

దుర్గామాత ఆలయంలో చోరీ

పెద్దవంగర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో చోరీ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై చిలువేరు ప్రమోద్‌కుమార్ తెలిసిన వివరాల ప్రకారం.. దుర్గామాత ఆలయ పూజారి అనపురం యాకయ్య రోజువారీగా శనివారం పూజలు చేసి అనంతరం ఆలయానికి తాళం వేసి వెళ్ళాడు. ఆదివారం తెల్లవారు జామున ఆలయంలో పూజలు చేయాడానికి వెళ్లిన క్రమంలో ఆలయ తాళం పగులకొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. దుర్గామాతకు అలంకరించిన సుమారు రూ.25వేలు విలువ చేసే 6 గ్రామాల బంగారం, 10 తులాల వెండి గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఆలయ పూజారి అనపురం యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఘటన స్థలంను పరిశీలించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సై సాయికుమార్‌కు ఘనంగా సత్కారం

గార్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన ఎస్సై సాయికుమార్‌ను బంజార సేవాలాల్‌సంఘంతో పాటు పురుగు మందుల వ్యాపారులు ఆదివారం సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు లింగాల ఉమేష్‌నాయుడు, ధార్న వీరన్న, గట్టు నరేందర్, తిరుమలరావు, అజ్జుల్‌మియా, భిక్షపతి, సాయిలు, రమేష్, మహేష్, సేవాలాల్ సంఘం నాయకలు సాయికుమార్, బానోత్ శ్రీను, సంతోషం, గంగావత్ కిషన్ నాయక్, దేవేందర్, లచ్చు, శివనాయక్ పాల్గొన్నారు.

కోతుల బెడదపై గ్రామస్థుల సమావేశం

దంతాలపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కోతుల బెడద పెరగడంతో గ్రామస్థులు ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు శనివారం రాత్రి మైక్‌లో ప్రలందరికీ సమాచారం అందించి ఆదివారం తెల్లవారు జామున సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు కోతుల బెడద నివారణపై తీర్మానం చేశారు. కోతుల బెడదపై సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కోతులను పట్టించేందుకు చేపట్టే కార్యాచరణను త్వరలో సిద్ధం చేయాలని తీర్మానం చేశారు. మండల కేంద్రంలో వేల సంఖ్యలో కోతుల బెడద ఉండడంతో ఇంట్లోకి చొరబడి ప్రజలను, రోడ్లపై ప్రయాణించే వారిని సైతం తీవ్రంగా గాయపరుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని మండల కేంద్రం ప్రజలు కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మరిపెడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి భారత సైనికుల మనోభావాలను కించపరుస్తూ, కేంద్ర ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశా రని మరిపెడ బీజేపీ శ్రేణులు ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే భారత సైనికులకు, కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకురాలు భూక్యా కాంతమ్మ, రూరల్ అధ్యక్షుడు గంగాధర్, పట్టణ అధ్యక్షురాలు భూక్యా మంగమ్మలింగంనాయక్, నాయకులు బింగి రమేశ్, ఆకుల హరికృష్ణ, సుధాకర్, సురేశ్, పాల్వాయి భాస్కర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● నర్సింహులపేట(మహబూబాబాద్ క్రైం) నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో దేశ సైన్యం, కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నర్సింహుల పేట అంబేద్కర్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను వెనుకకు తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎరనాగి కుమారస్వామి, మేరుగు యాకయ్య గౌడ్, సత్యనారాయణ రెడ్డి, వీరన్న, కాలునాయక్ ఉన్నారు.



నర్సింహులపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

డోర్నకల్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

డోర్నకల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలురు, బాలికల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు డోర్నకల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం ప్రారంభమయ్యాయి. తెలంగాణలోని అన్ని జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు డోర్నకల్‌కు తరలివచ్చారు. ఈ పోటీలను జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలోజు సుధాకర్, సీనియర్ వెయిట్ లిఫ్టర్ మండలోజు కృష్ణమూర్తి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.